# డబ్బు కోసం

కన్నసామి

అర్ధ రాత్రి మరి అంతా ఒళ్ళు మరచి నిద్రపోతున్న వేళ తలుపు కొడితే ఎవరికి ప్రాణం? పైగా మా యింట్లో మూడు వాటాలవాళ్లం ఉంటున్నాం. పగలంతా ఒళ్ళు విరుచుకున్న మగరాయళ్లమంతా బరువు బతుకులు మరచిపోయి నిద్రా సామ్రాజ్యంలో రాజాధిరాజుల్లా విహరిస్తున్నాం. ఇప్పుడు మనకోసం తలుపు కొట్టేవాళ్ళెవరని మొదట ఊరుకున్నాను. మా ఆవిడకి అసలు తెలివే రాలేదు. మా కుంట వెనకని అక్కడ చేర్చుకొని పడుక్కుంది. బహుశా కలలో పుట్టింటికెళ్ళి వాళ్ల తమ్ముడిచ్చిన చీరని పాగిడేస్తోందనుకుంటాను. తెలివి రానే లేదు కనక తలుపు తీసే ప్రశ్నే లేదు.

పోగా విశ్వనాథం కక్కయ్యగారు పన్నెండువరకూ ఎవళ్ళని నిద్రపోనియ్యకుండా కబురు చెప్పి చెప్పి అలసి సొలసి — నిద్రపోతారేమో — అతనికి ఉదయం ఎనిమిదికి ఏకంగా తెల్లవారుతుంది. ఆయన భార్య కూడా తినూ తినకూతుళ్ళూ తన తల్లిదండ్రులూ ఎంత గొప్పవాళ్ళో రాత్రల్లా తక్కిన రెండువాటాలవాళ్లకీ చేతనొప్పెంతవరకూ నోరు పీకేటట్టు ఉద్ఘోషించి కోపిష్టివట్టు పడుక్కుంది. ఆవిడకి తెలివి వచ్చినా నిండా కప్పుకొని పడుక్కునే ఉంటుంది. ఆ విడకి సుమారు నలభైయేళ్లు వచ్చినా ఇంకా మగాళ్ని చూసి కొత్తపెళ్లికూతురిలా సిగ్గుపడుతూనే వుంటుంది. ఎవరికీ తలుపు తీయడం ఆవిడ మతమే కాదు. ఇక మిగిలినదల్లా నేను. నేను పరోపకారినని యింటో వాళ్ళనుకుంటారు. (మా ఆవిడ కోపం వచ్చినప్పుడు ఈ గుణాన్నే పూనుకొని తిరగడం అంటుంది.) ఇంట్లో అందరికీ నా దౌర్బల్యం తెలుసు. ముష్టివాడొచ్చి కేకేసినా జవాబు చెప్పకుండా ఉండలేను. అంతా యింట్లోనే వున్నా ఎవళ్ళ పనుల్లో వాళ్ళుండి తన కేమీ పట్టనట్టు, ఆ వచ్చిన బిచ్చగాడేదో నాతో పనుండి వచ్చినట్టు భావించి నేనే లేస్తానని ఊరుకుంటారు. అయితే ఇదంతా చెప్పడం నేను ధర్మాత్ముణ్నని కాదు. సాధారణంగా బిచ్చగాళ్లకి ఏమీ లేదని చెప్పి పంపివేస్తాను. నా స్వభావం వచ్చినవాళ్లకి ఏదో సమాధానం చెప్పి పంపించడం.

ఇంతకీ అప్పుడు మరెవరూ తెలివిగా లేరనుకుంటాను. నేనే తలుపు తియ్యవలసివచ్చింది. ఆ కటిక చీకటిలో వచ్చిన మనిషి ఆడమనిషి అని మాత్రం గుర్తించగలిగాను. చేతిలో ఏదో సంచీ అయి ఉండొచ్చు. ఎత్తూ విగ్రహం చూస్తే రుక్కుపిన్ని విధవకూతురు కామాక్షిలా కనిపించింది. ఆ యింట్లో ఎవరూ మా బంధువులు కారు. అయినా అందరితోనూ మా వదినా, అన్నయ్యా... అని వరసలు కలుపుకోవాల్సి వచ్చింది. వచ్చిన వ్యక్తి 'అన్నయ్యగారా? కులాసాగా వున్నారా' అన్నది మెల్లిగా. గొంతుక వలకూడా కామాక్షి అని నిశ్చయించుకున్నాను. 'ఆఁ వచ్చేశారా' అన్నాను నిద్రమత్తు వదలని కంఠస్వరంతో. అంతా నిద్రాముద్రితులై ఉండగా మాటలేమిటి. పైగా ఆ విడకూ నాకూ మాట్లాడుకొనే అలవాటు లేదు కూడాను. ఈ బసలో ఉంటూన్న మూడు సంవత్సరాల్లోనూ ఇదివరకు ఒక్కసారే అన్నయ్యగారూ అన్నదావిడ. ఇది రెండో సారి. ఆవిడ నాకంటే బాగా పెద్దది. ఆ సంగతి తెలుస్తూనే వుంది. అయినా అన్నయ్య అనడంలోనే కామాక్షికి సబబు కనిపించి ఉంటుంది, చాలామంది ఆడవాళ్లలాగే. ఆవిడ తనవాటాలో దూరి రుక్కుపిన్నినీ చెల్లెళ్లనీ తమ్ముణ్ణీ లేపింది. స్వయంగా లేపకపోయినా వాళ్లందరూ కామాక్షి వచ్చిందంటే లేస్తారు. అందుకు కారణం అందరికీ కావాల్సిన డబ్బు. కామాక్షి వెళ్లడం డబ్బు కోసమే! వస్తే డబ్బు తెస్తుంది. తమకు లాభించకపోయినా — కామాక్షి పోయినభర్త ఆస్తులవల్ల వచ్చేడబ్బు పెద్దబాకీలేవైనా తీర్చడానికి పనికొస్తాయని అందరి ఆశ. ఇంతసేపూ మెల్లగా వినిపిస్తున్న గుసగుసలూ వాగ్వాదాలూ హఠాత్తుగా ఆగిపోయాయి. రుక్కుపిన్ని కామాక్షిని తీసుకొని వీధితలుపు తెరిచి వెళుతోంది. మళ్లా ఆ సంచీతోనే కామాక్షి బయటకు నడిచింది. రుక్కుపిన్ని వీధిలోకూడా పది నిమిషాలు కామాక్షితో మాట్లాడి చివరికి తనొక్కర్తె తలుపు గడియ వేసుకొని ఇంట్లో కెళ్లి పడుకుంది. రుక్కుపిన్ని కామాక్షిని వెనువెంటనే అంత అర్ధరాత్రి వేళ ఎందుకు బయటికి నడిపించిందో నాకు బోధపడలేదు. అయినా మనకెందుకీ పరిశోధన అనుకొని నిద్రపోయాను.

ఆ రోజునుంచీ కామాక్షి అసలు కనిపించలేదు. ఆ యింట్లో రుక్కుపిన్నికి పిల్లలకీ తప్పితే కామాక్షి వచ్చినట్టు మరెవరికీ తెలిసినట్టు లేదు. అయితే నాకుమాత్రం నిశ్చయంగా తెలుసు. వచ్చిన మనిషిని అర్ధరాత్రి మళ్లీ ఎక్కడికి పంపేశారో అన్న ప్రశ్న తక్కిన వాళ్లకి అక్కర లేదు, వచ్చినట్టే తెలియదు కనక. నా కళ్లతో నేను చూశాను. అయితేనేం ఇంట్లో కామాక్షి వచ్చిన ప్రసక్తే లేనేలేదు. రుక్కుపిన్నిగారింట్లో పిల్లల దగ్గర్నుంచీ అంతా ఖతేవాళ్ళు. వాళ్ళంతా ఒకే కట్టు. పూర్వం — ఆదేదో కథలో — నల్ల మేకని దొంగలంతా కుక్క అంటూ బాపనయ్యని నమ్మించినట్టుంటుంది వీళ్ళ సంగతికూడాను... ఒక సమాచారం — అది నిజమైనా అబద్ధమైనా — ఇంట్లో ఒకళ్ళు ఫలానాలా అయిందంటే — అది కాదని బ్రహ్మదేవుడొచ్చి వాదించినా లాభంలేదు. ఇంట్లో అంతా ఏకమైపోయి నిలబడి సమర్థిస్తారు. కామాక్షి వచ్చి వెళ్ళినట్టు ఆ యింట్లో ఒక్కళ్ళూ బయటకు పొక్కడంలేదు. నేను ప్రతిరోజూ ప్రతి గడియా ఈ సమస్యతోటే సతమతం అవుతున్నానని కాదు. కాని జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఆశ్చర్యపడుతూండేవాణ్ణి. కామాక్షిని బయటకు పంపేశారు అనుకోవడం పొరబాటే అవుతుంది. వాళ్ళకిమాత్రం తెలియదూ! పరస్పరాశ్రయాలు గల జీవులు వాళ్లు.

ఆ వేళ ఆదివారం. నేను ఇంటి దగ్గరే వున్నాను. ఆదివారం అనగానే 9 గంటలకో సారి కాఫీ, పన్నెండుకి భోజనం అలవా

కుయిపోయింది. మా అమ్మ చివాట్లు వేసినా పన్నెండులోపుగా ఇల్లు చేరడం చేతనైతే కదా! నేనావేళ యిల్లు చేరే అప్పటికి మామూలు వేళ అవనే అయింది. మా అమ్మ ఊరుకుంది ఎందుచేతనో.

ఇంటి యజమానురాలు సూరమ్మగారొచ్చినట్టున్నారు. ఆవిడ ఎంచేతో ఈ రోజు కొంచెం గట్టిగా మాట్లాడుతున్నారు. ఆవిడ రావడం, అద్దెలు వసూలు చేసుకు వెళ్ళడం ప్రతినెలా మామూలే! ఆవిడ ఎంతటి ఆర్థిక సమస్యనైనా తొణుక్కుండా కంగారు పడకుండా పరిష్కరించుకోగలదు. గంభీరంగా మృదువుగా మాట్లాడుతుంది సూరమ్మగారు. అలాటి సూరమ్మగారీ రోజు తొందరపడి విసురుగా మాట్లాడ్డం నాకాశ్చర్యం వేసింది. మా వాటాలోకి తిన్నగా వెళిపోయాను. నా భోజనం పూర్తవబోయే టప్పటికి సూరమ్మగారి గొంతూ, ప్రతిధ్వనిలా రుక్కుపిన్ని గొంతూ ఝూంమని ఊగిపోతున్నాయి. రుక్కుపిన్నిగారు సూరమ్మకి కొంచెం బంధువరంలో వాళ్ళే. సూరమ్మగారి తండ్రి—రుక్కుపిన్ని కుటుంబం ఆర్థిక చిక్కుల్లో వుండగా కోలుకోవడానికి చేసిన సదుపాయమే ఈ యింట్లో బస. రుక్కుపిన్నిగారి కుటుంబం ఎవళ్ళ యింట్లో వున్నా అద్దె చెల్లించుకోలేక పోవడం, మూడు నాలుగు నెలల్లో ఖాళీచేసి మరొక యిల్లు చూసుకోవడం తటస్థించేది. డబ్బు సర్దుబాటు కాక ఒక నెల అటో యిటో అయితే ఏ యింటి యజమానీ క్షమించేవాళ్ళు కాదు. ఆ అవస్థలో రుక్కుపిన్ని—సూరమ్మ తండ్రిగార్ని తనకి గృహభిక్ష పెట్టమని కోరింది. ఆయన మృదుడు. సహృదయుడు. తనకీ రుక్కుపిన్ని తండ్రికీ వుండే బాల్యస్నేహం తల్చుకొని తన యింట్లో వాటా యివ్వడానికి సమ్మతించాడు. వీలయినప్పుడల్లా ఇవ్వ గలిగినంత డబ్బు యివ్వమని రుక్కుపిన్నికి ముసలాయన చెప్పాడు.

ముసలాయనకి సూరమ్మ ఒక్కర్తె కూతురు. ఆ ఆస్తిపాస్తులు ఆవిడకే చెందాయి. సూరమ్మ తన తండ్రిచేసిన సదుపాయం కాదనడం ఇష్టం లేక ఊరుకుందేగాని లేకపోతే రుక్కుపిన్ని కుటుంబం ఈ యింట్లో వుండడం తనకేమాత్రం ఇష్టంలేదు. అయినా సూరమ్మ అంత సులభంగా బైటపడే మనిషి కాదు. అద్దెమాత్రం సాధ్యమైనంత ఖచ్చితంగా పుచ్చుకోడానికి ప్రయత్నించేది. రుక్కుపిన్నిగారికి నెలనెలా పూర్తిగా అద్దెయిచ్చుకోవడం కష్టమైపోతుంది. కొంత యివ్వడం కొంత వెనకబెట్టడం ఈ విధంగా ఆ అద్దెబాకీ ఏ అయిదారు నెలలకో పెద్ద మొత్తం అయి ఊరుకుంటోంది. ప్రతినెలా సూరమ్మగారు ఓ చిన్న దులుపు దులుపుతారు. లేదా సాధించుకు వెళ్తారు. ఇప్పుడు రుక్కుపిన్నీ సూరమ్మగారూ ఝూంమని ఊగిపోవడం చూస్తే ఇదే వ్యవహారం పాకాన బడ్డట్టు అనిపించింది.

నేను భోంచేసి వాలుకుర్చీమీద మేను పడేశాను. సూరమ్మగారి ఉద్రేకం కట్టలు తెంచుకుంటోంది. ఆవిడ నావైపు తిరిగి నాతో చెప్పడం ఆరంభించింది. "చూడవోయ్ పంతులూ. ఈవిడ అర్నెల్లయింది కానీ అద్దెయివ్వలేదు. ఎన్నాళ్ళిలా ఆటలాడుతుంది అంటాను. మనిషన్నవాళ్ళకి కృతజ్ఞత వుండాలోయ్. సిగ్గూశరం విడిచినవాళ్ళందరిదీ ఒక జన్మేనా!" సూరమ్మగారు దులిపేస్తూంటే రుక్కుపిన్ని నన్ను చూసి ఎందుచేతో లోపలికి వెళ్ళింది. వెళుతూ "నామాట వినిపించుకుంటే కదూ! ఇవతల వీళ్ళ యిబ్బందులేమిటో తెలుసుకుంటేనా!" అన్నది. సూరమ్మగారు మళ్ళీ శివం ఎత్తినట్టు అన్నారు. "అర్నెల్లబట్టి అంటున్నావమ్మోయ్ ఆమాటేను. 'మా అమ్మాయి బెజవాడ వెళ్ళుతుంది డబ్బు తెస్తుంది' అన్నావు. 'వెళుతుంది వెళుతుంది' అని అర్నెల్లు కాలక్షేపం చేశావు. వెళ్ళి నెలరోజులయినా ఇంకా రాలేదు. 'వచ్చేస్తుంది వచ్చేస్తుంది' అని ఇంకెన్నాళ్ళమ్మా నన్ను తిప్పుతావూ! ఇదంతా నన్నాటలు పట్టిస్తున్నావా!"

నాకు తలలో ఏదో కదులుతున్నట్టు అనిపించింది.

సూరమ్మగారు ఈ నెలలో ఏయే తారీకుల్లో వస్తారో రుక్కుపిన్నిగారి కుటుంబం అంతటికీ తెలుసు. సూరమ్మగారెప్పుడు తన వూరినుంచి బయలుదేరి వస్తుందో, ఎవళ్ళకి ముందుగా తెలియజేయడానికి ఉత్తరం వ్రాస్తుందో, అదంతా తెలుసు. సూరమ్మగారు వచ్చే అప్పటికి 'కామాక్షి ఇంకా బెజవాడనుంచి రాలేదనీ త్వరలో రావచ్చనీ' రుక్కుపిన్ని విన్నవించుకుంది. సూరమ్మగారు నమ్మినా మానినా అప్పుడంతకంటే చేయగలిగిందేమీ లేక మరి నాలుగు చివాట్లు పెట్టి వెళిపోయారు. "నేను మళ్ళా వొచ్చినప్పటికి ఖర్చయిపోయిందంటే లాభం లేదమ్మోయ్. మీ అమ్మాయి వచ్చిన వెంటనే డబ్బు పంపిసే సరి – లేకపోతే మళ్ళా నేనొచ్చినప్పుడు, ఎందుకు యిల్లు ఖాళీ చెయ్యరో చూస్తాను." అంటూ నిష్క్రమించింది. సూరమ్మగారు.

నాకు నిజంగా మూర్ఛ వొచ్చింది.

ఆ రాత్రి తెల్లవారిందో ఇంకా లేదో కామాక్షి ప్రత్యక్షం. అహా! ఏమి ఆలోచన! ఎంత చక్కని నిగూఢమైన ఏర్పాటు!! రుక్కుపిన్ని బుద్ధిచాతుర్యానికి నిజంగా నాకు ముచ్చటవేసింది. రుక్కుపిన్ని— "వచ్చావా అమ్మా! నువ్వింకా బెజవాడ నుంచి రాలేదని..." అంటూ మా రెండు వాటాల వాళ్ళకీ వినిపించేటట్లు పలకరించింది.

రుక్కుపిన్నీ కామాక్షీ మాట్లాడుకుంటున్నారు.

"పాపం సూరమ్మగారు మళ్ళా వొచ్చే అప్పటికి డబ్బుంటుందో ఖర్చయిపోతుందో ఏమిటో! ఈవారం రావలసింది" అన్నది కామాక్షి బహిరంగంగాను. రుక్కుపిన్ని కూడా "అవునవును. విన్నను అనవసరంగా నోరుపారేసుకొని వెళ్ళిందిగాని ఒక్కరోజు ఆగలేకపోయింది" అని అందించింది

"నోరు పారేసుకుంటే మాత్రం, డబ్బు పారేసుకుంటానుటమ్మా. అమ్మాయి ఇవాళ వస్తుందని చెబితే, ఒక్కరోజేం కర్మ మీ యింట్లోనే వుందును" అంటూ ప్రవేశించిన సూరమ్మగార్ని చూసేసరికి రుక్కుపిన్నికీ కామాక్షికీ నోరు పెగలేదు. ఆ యింట్లో వాళ్ళంతా ఎక్కడవాళ్ళక్కడ స్తంభించిపోయారు. "మా సీత కొడుకు ఉన్నాడు చూశావూ నాయినా. ఆ కుర్రవెధవ నన్ను దొడ్డమ్మా నువ్వెప్పుడు ఊరికెళ్తావని నాలుగురోజులయింది తినేస్తుంటే ఏమిటో అనుకున్నాను. ఈ గుంటవెధవ నా ప్రయాణం ఎప్పుడో తెలుసుకొని చేసే రాచకీయాలేవిటో, ఎవరికోసం అడుగుతున్నాడో— వాణ్ణి రెండు రోజులింట్లోంచి కదలనివ్వక పోయేసరికి బయటపడ్డాయి."

నావైపు తిరిగిన సూరమ్మగారి ముఖం విజయభేరి మోగిపోయింది ★



నారసింహ లేహ్యము
బంగారుతో చేరినది మేహము, రక్తాతి, విస్ఫోటకము వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును 40 తులముల సీసా రు 1-4-0 పోస్టేజీ రు 1-1-0
పి. ఎ. ఎ అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిడేపి (PO) నెల్లూరుజిల్లా.



ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు
మెసర్సు సీతారామ్ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్
విజయవాడ, సికిందరాబాదు.